

5

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను


జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -85 మంగళవారం 1 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మెస్సీ శకం ముగిసింది

**అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్**

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని

మిగతా 2లో.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

## మూసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**విపక్ష నేతగా కేసీఆర్ ఫెయిల్‌ఆయనకు, నాకు పోలిక ఏంటీ..**

**వెయ్యిరోజుల్లో ఒక్కరోజైనా బయటకు వచ్చారా?**

**కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఆరు రోజులపాటు ఆందోళనలు**

**రెండేండ్లలోనే మూసారాంబాగ్ వంతెన పూర్తి**

**వచ్చే ఏడాది రెండువేల పడకలతో ఉస్మానియా ఆస్పత్రి ప్రారంభం**



**అంబర్‌పేట ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. " కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి ?.. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవులు కట్టబెట్టారు.. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాను" అని సీఎం అన్నారు.

మిగతా 2లో.



## యుద్ధానికి ముగింపు కావాలి

**ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం**

**అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త):**
కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు.

మిగతా 2లో.

## తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

**ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్**

**రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్ ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త):**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు.

మిగతా 2లో.



## ‘పుట్టింటి నుంచే బయటకు పంపారు’

**సభలో బోరున విలపించిన కవిత**

**బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత**

**సభలో కన్నీటి పర్యంతమైన కవిత**

**“కవిత సీఎం” అంటూ కార్యకర్తల నినాదాలు**

**కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత**

**తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన**

**హైదరాబాద్ ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. “నాతో ఎందుకు ఇలా చేయాలి?” అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.





2లో.

## పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

**విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం**

**పిటిషనర్ సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని సూచన**

**పాత వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పిటిషన్‌లో వాదన**

**ఇలాంటి పిల్‌ను గతంలోనే తోసిపుచ్చామని తెలిపిన కేంద్రం**



# వెలిగొండకు కృష్ణాజలాలు



## వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ



**పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం**

**దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి**

**తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు**

**ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**ప్రకాశం/దోర్నాల ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త):**
ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం



# వెలిగొండకు కృష్ణాజలాలు

మొదటిపేజీ తరువాయి

పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.
నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.
ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు.
1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు




తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు.
ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.
గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.
సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

### వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.
ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

### అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి




పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వెయ్యిరోజుల్లో ఒక్కరోజైనా ఆయన జనం కోసం బయటకు రాలేదని తెలిపారు. 'పదేండ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేండ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం' అని సీఎం సవాల్ విసిరారు. ప్రజల కోసం పనిచేయని కేసీఆర్.. పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని అంబర్‌పేట, ముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జిని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు మాజీ ఎంపీ వి. హనుమంతరావు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణను మూడు ప్రాంతాలుగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో



నివసిస్తున్న ప్రజలు వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మూసారాంబాగ్ వంతెన ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. అంబర్‌పేటలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించలేదని ఆరోపించారు. పేదల కష్టాలు తమకు తెలుసని, అందుకే వారికి ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. బతుకమ్మకుంటను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ఆడబిడ్డలకు బహుమతిగా ఇచ్చామని తెలిపారు. కానీ మళ్లీ బతుకమ్మకుంట కబ్జాకు యత్నిస్తున్నారంటూ తెలిపారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నాం తప్ప విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని స్పష్టం చేశారు. హైడ్రాపైనా, తనపైనా కొంతమంది పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలని తెలిపారు.
ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు ఆరోపిస్తున్నారనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. ధనిక రాష్ట్రంగా అప్పగించిన తెలంగాణను గత ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.7,500 కోట్ల మేర అసలు, వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందేవి కావని, తమ ప్రభుత్వం ఒకటో తేదీన వారికి వేతనాలు చెల్లిస్తోందన్నారు. 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెం ట్ బెనిఫిట్స్ విడుదల చేశామన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, తమ ప్రభుత్వం రెండేండ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు కట్టామన్నారు. రైతుల కోసం రూ.లక్షా 70 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. తాము అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు. 3 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. కేసీఆర్ ఏనాడైనా రేషన్ కార్డుల గురించి ఆలోచన చేశారా అని ప్రశ్నించారు.

# 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.
తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

మొదటిపేజీ తరువాయి

సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది."ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు.
రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు.

# యుద్ధానికి ముగింపు కావాలి

మొదటిపేజీ తరువాయి

ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో "ఇది యుద్ధాల యుగం కాదు" అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

### కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

## పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

### విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఇథనాల్ శాతం ఎంతో తప్పనిసరిగా వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సోమవారం ధర్మాసనం సూచించింది.న్యాయవాది ఎన్.కె. గోస్వామి సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. పెట్రోల్ నాజిల్లపై, జారీ చేసే రశీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని ఆయన కోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌కు ఏయే వాహనాలు అనుకూలంగా ఉంటాయో తెలిపే అధికారిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ముఖ్యంగా 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలకు ఇ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వాడకం వల్ల తలెత్తే సమస్యల నుంచి రక్షణ కల్పించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై వాటి వివరాలను వెల్లడించినట్లే, తాము కొనుగోలు చేసే ఇంధనం గురించి తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని ఆయన వాదించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాళేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఇది ఒక 'ప్రాక్సీ పిటిషన్' అని, ఇదే తరహా వ్యాజ్యాన్ని 2025 సెప్టెంబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు.ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఇ20 పెట్రోల్ వల్ల వాహనాల యాక్సిలరేషన్ మెరుగుపడటంతో పాటు ఉద్గారాలు తగ్గుతాయని, దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే.

# రూ.14 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

## 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?





**హనుమకొండ/బ్యూరో ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలోని 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొదిల సాయిబాబా డిమాండ్ చేశారు. తెలంగాణవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాయిబాబా పేర్కొన్నారు. కోర్సులు పూర్తి చేసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి, విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్, హనుమకొండ జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ కొట్టే యేసోబు, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొచ్చు నాగరాజ్, ఉపాధ్యక్షులు మైదం రవి, పద్మ, శైలజ, కృష్ణ, సలీం పాషా, కుమారస్వామి, ఎల్లస్వామి, విష్ణు, తిరుపతి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకూ.. సొంత గూడు కావాలి!

## మంత్రి పొంగులేటికి కేసముద్రం విలేకరుల వినతి



**కేసముద్రం/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త);**ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తూ పనిచేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేకపోవడం బాధాకరమని కేసముద్రం మండల విలేకరులు పేర్కొన్నారు. దశాబ్దాలుగా వృత్తిలో కొనసాగుతున్న పలువురు జర్నలిస్టులు నేటికీ అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేసముద్రం మండల జర్నలిస్టులకు ప్రాధాన్యం కల్పించి ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.ద


# అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా రాగమయి



**సత్తుపల్లి/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త) ;**తెలంగాణ శాసనసభ లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా రాగమయి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ లైబ్రరీని మరింత అభివృద్ధి చేసి, శాసనసభ్యులకు అవసరమైన విజ్ఞానం, సమాచారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, లైబ్రరీ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొని రాగమయికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్ నాగయ్యకు ఘన సన్మానం

**ఖమ్మం/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం మున్సిపాలిటీ పరిధికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నల్లగట్టు నాగయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా అధ్యాపకులు, ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఉత్తమ డ్రైవర్‌గా, భద్రతా డ్రైవర్‌గా, సీనియారిటీ పరంగా పలు మన్ననలు పొందిన నాగయ్యను ఈ సందర్భంగా అభినందించారు.



నాగయ్య 1996లో భద్రాచలం డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధుల్లో చేరారు. ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రమాద రహిత డ్రైవింగ్‌తో ప్రయాణికుల ఆదరణ పొందడంతో పాటు సంస్థ నుంచి పలు ప్రశంసలు అందుకున్నారు.మరోవైపు తన కుమారుడు నల్లగట్టు ప్రవీణ్ మానసిక దివ్యాంగుడైనప్పటికీ, మానసిక దివ్యాంగుల కేంద్రంలో సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. తన కుమారుడితో పాటు సుమారు 60 మంది మానసిక దివ్యాంగులను సొంత తండ్రిలా కంటికి రెప్పలా చూసుకుంటూ సేవలందించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సేవలోనూ ముందుండి పలువురి ప్రశంసలు అందుకున్నారు.
నాగయ్య, ప్రమీల దంపతుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు హోండా ప్రసాద్ (భద్రాద్రి కొత్తగూడెం), జిల్లా కార్యదర్శి ఆర్.టీ.రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యదర్శులు, ఖమ్మం డిపో మేనేజర్, రీజినల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. నాగయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రొఫెసర్స్ కాలనీలో హరితహారం



**హసన్‌పర్తి/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** ప్రొఫెసర్స్ కాలనీలో హరితహారం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు.కాలనీ పరిసరాలను పచ్చదనంతో నింపాలనే ఉద్దేశంతో డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు నూజివీడు నుంచి ప్రత్యేకంగా మొక్కలను తెప్పించారు. ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. పచ్చదనం పెంపొందించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. భవిష్యత్‌లోనూ కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు.కార్యక్రమంలో ప్రొఫెసర్స్ కాలనీ అధ్యక్షుడు రమణయ్య, రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ ప్రొఫెసర్ డా. రామయ్య, ఫార్చ్యూన్ రెసిడెన్సీ అధ్యక్షుడు బొక్క కుమార్, ఫార్చ్యూన్ హిల్స్ అధ్యక్షుడు కిషోర్, అభిరామ్ అపార్ట్‌మెంట్ అధ్యక్షురాలు పొన్నాల అరుంధతి, మహేందర్‌రాజు, మణిదీప్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి పెద్దులు, వెంకటేశ్వర్లు, సంపత్‌రెడ్డి, పాపిశెట్టి కిరణ్, బాలరాజు, హరి, వేణుగోపాల్, బాబురావు, పావని తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవలో అగుస్తో కొలంబో చిరస్మరణీయం





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త );**
పేదలు, నిరుపేదల సంక్షేమానికి ఫాదర్ అగుస్తో కొలంబో చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. కరుణాపురం గ్రామంలోని పెద్ద చర్చి వద్ద సోమవారం ఆయన 17వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఇటలీలో జన్మించిన ఫాదర్ అగుస్తో కొలంబో భారత్‌కు వచ్చి వరంగల్ ప్రాంతంలో, ముఖ్యంగా ఘనపూర్ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యాలయాలు, ఆస్పత్రుల నిర్మాణంతోపాటు కుష్టువ్యాధిగ్రస్తులు, వికలాంగులు, అనాథలు, పేదలకు విద్య, వైద్య సేవలు అందించారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, వ్యవసాయానికి బావుల తవ్వకం, జీవనోపాధి కోసం గేదెల పంపిణీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళలకు కుట్టుమిషన్లు అందించారు.సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ఆయన లేని లోటు ఈ ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో భైరపాక ప్రభాకర్, ఫాదర్ పూదోట ప్రకాష్, ఫాదర్ మారేపల్లి ప్రవీణ్, మునిగాల రాజు, గిన్నారపు రమేష్, ఏరువ భాస్కర్, నీరటి మల్లేష్, కందుకూరి శ్రీనివాస్, పొత్కమూరి రాజేష్, పోగుల యుగేందర్, ఏరువ సుగుణ, టి.జ్యోతి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# కేసముద్రంలో అభివృద్ధి సందడి

## ఒకేరోజు పలు భవనాల ప్రారంభం.. శంకుస్థాపనలు -నారాయణపురం రైతులకు భూమి పట్టాల పంపిణీ





**కేసముద్రం/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఒకేరోజు పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, నూతన నిర్మాణాలకు శంకుస్థాపనలు, రైతులకు భూమి పట్టాల పంపిణీ కార్యక్రమాలతో సందడి నెలకొంది.

**రూ.1.90 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్**

కేసముద్రం ప్రాంత ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం చూపే దిశగా రూ.1.90 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు ప్రారంభించారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

**పలు భవనాలకు శంకుస్థాపన**

కేసముద్రం మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మంత్రులు భూమిపూజ చేశారు. ఇనుగుర్తి, దంతాలపల్లి, సీరోలు మండలాల తహసీల్దార్ కార్యాలయాల నూతన భవన నిర్మాణాలకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. నూతన కార్యాలయాలు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి.

**రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెర**

నారాయణపురం గ్రామ రైతులకు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భూమి హక్కు పత్రాల సమస్యకు పరిష్కారం లభించింది. మంత్రుల చేతుల మీదుగా రైతులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**భారీగా తరలివచ్చిన ప్రజలు**

కార్యక్రమాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్,



ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళీనాయక్, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరీష్ తదితరులు హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బానోతు సునీత, వైస్ చైర్మన్ అల్లం రమ, అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 16న సీఎంకు కృతజ్ఞత సభ

## ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

**తల్లాడ/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు.సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ



ఉద్యమకారులకు తగిన గుర్తింపు లభించలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, కేకే కమిటీ నివేదిక ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.
ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్ కల్పిస్తామని సీఎం ప్రకటించడం శుభపరిణామమన్నారు. సెప్టెంబర్ 16న నిర్వహించే కృతజ్ఞత సభకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రహీం, కన్వీనర్ చందర్‌నాయక్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, గడ్డ యాదయ్య, కందుల శ్రీను, అందె కృష్ణ, అంజి, నక్క మహేష్, దర్శనం జాన్, మొగిలిగిద్ద ప్రసాద్, దేవరకొండ నరేష్, కల్వకుర్తి శ్రీశైలం, మీసాల మహేష్, శ్రీనివాస్, బొమ్మరిల్లు స్టాలిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## సెప్టెంబరు 2 నుంచి వారం రోజులపాటు బీఆర్ఎస్ పోరుబాట



**సత్తుపల్లి/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త);** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సెప్టెంబరు 2 నుంచి వారం రోజులపాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేయాలన్నారు. నియోజకవర్గంలోని సుమారు 60 వేల కుటుంబాలకు బీఆర్ఎస్ బాకీ కార్డులు అందించాలని సూచించారు. 100 రోజుల్లో 13 డిక్లరేషన్లు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం 1000 రోజులు గడిచినా హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు.రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బోనస్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, కళ్యాణలక్ష్మిషాదీముబారక్, విద్యా భరోసా, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సి వస్తోందని, యాప్‌లు, నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చినా భూ సమస్యలు మరింత సంక్లిష్టమయ్యాయని



విమర్శించారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని సండ్ర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయ నేపథ్యాన్ని బట్టి పథకాలు అందుతున్నాయని ఆరోపించారు. 1000 రోజుల సమయం ఇచ్చామని, ఇక ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీసే సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యకర్తలు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# కృష్ణాష్టమికి భారీగా తరలిరావాలి

## యువత, మహిళలకు సుందర్‌రాజ్ యాదవ్ పిలుపు



**హసన్‌పర్తి/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ కూడ చైర్మన్, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 4న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న వేడుకలపై సోమవారం హసన్‌పర్తి మండలం సీతంపేట, మడిపల్లి గ్రామాల్లో యాదవ సంఘం నాయకులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్‌ను యాదవ సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శ్రీకృష్ణాష్టమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాదవుల ఐక్యతను చాటేలా వేడుకలను విజయవంతం చేయాలని సుందర్‌రాజ్ యాదవ్ కోరారు.సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2 గంటలకు రామ్‌నగర్‌లోని బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు శ్రీకృష్ణ రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. రథయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కళాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి శ్రీ పెండెం శ్రీలక్ష్మి రామానంద్

**నర్సంపేట/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త);**
సోమవారం రోజున నర్సంపేట పట్టణంలోని రేషన్ షాప్ నెంబర్ 09 లో 22వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రీ బాణాల ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది
ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి శ్రీ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేదల కడుపు నింపే ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వంలో మంజూరు చేయనటువంటి రేషన్ కార్డులను రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో భాగంగా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని ఉద్దేశంతో కొత్త




రేషన్ కార్డుల పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినారునిరుపేద వర్గాలకు ఉపయోగపడే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొనడం చాలా సంతోషదాయకమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి వీఆర్వోలు వీఆర్ఏలు రేషన్ షాప్ డీలర్ రామగోని పుష్ప సుధాకర్, పిసిసి మెంబర్ పెండెం రామానంద్, మాజీ మార్కెట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎర్ర యాకోబు రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ జనగాం వీరకుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల సారంగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ 22వ వార్డు అధ్యక్షులు కొయ్యడి కిరణ్ కుమార్ గౌడ్, వడిచర్ల రమేష్ బొమ్మిదేని సత్యం దోనికల మల్లేష్ తాళ్లపల్లి చేరాలు, కక్కర్ల శ్రీధర్ గౌడ్, రాస మల్ల మహేందర్, బేరి రమేష్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు

# మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి

## సెప్టెంబరు 2 నుంచి 10 వరకు ఆందోళనలు

**నర్సంపేట/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా హామీలు అమలు కాలేదన్నారు.
అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.18 వేల కనీస వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ఫెడరేషన్, ఆటో కార్మికులకు రూ.12 వేల జీవనభృతి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని తెలిపారు.
హామీల అమలుకు సెప్టెంబరు 2 నుంచి 10 వరకు



దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 2న ఆశా, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్న భోజన కార్మికులు 3న భవన నిర్మాణ, బీడీ, హమాలీ, మిషన్ భగీరథ కార్మికులు ఆందోళనల్లో పాల్గొంటారని తెలిపారు.4న జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్మికులు 5న ప్రభుత్వ రంగ సంస్థలు, ఆర్టీసీ, విద్యుత్ రంగ కార్మికులు 6న ఆటో, టాక్సీ, లారీ, గిగ్ వర్కర్లు, సింగరేణి కార్మికులు పాల్గొంటారని పేర్కొన్నారు.
7న ప్రైవేటు పరిశ్రమలు, వైద్యశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు; 8న వీవోఏ, ఆర్పీలు, జీహెచ్ఎంసీ చెత్తబండ్ల కార్మికులు; 9న వీధి వ్యాపారులు, హోటల్, గ్రామపంచాయతీ కార్మికులు కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.10న ఎన్జీవోలు, ఉద్యోగ సంఘాల పోరాటానికి సంఘీభావం ప్రకటించి కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని యువరాజు పిలుపునిచ్చారు.సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, నవ తెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, దాడువాయి యూనియన్ రాష్ట్ర నాయకుడు పెరమండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుపై మోదీ ఫొటో ఉండాల్సిందే!

## లేకుంటే సీఎం, మంత్రి ఫొటోలు తొలగించాలి

## బీజేపీ నేతల డిమాండ్

**వేంసూరు/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):**
కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను మాత్రమే ముద్రించడం సరికాదన్నారు. వేంసూరు బీజేపీ మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా కార్యదర్శి పాలా నాగసురేంద్రరెడ్డి సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.కరోనా కాలం నుంచి ప్రధానమంత్రి



గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదలకు నెలకు ఐదు కిలోల ఉచిత బియ్యం అందిస్తోందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకంగా ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో బియ్యం అందిస్తూ మొత్తం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు.రేషన్ కార్డులపై మోదీ ఫొటోను ముద్రించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోతే.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను కూడా తొలగించి, లబ్ధిదారుల కుటుంబ ఫొటోతో కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం చేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కార్యక్రమంలో బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ నల్లమోతు నానిబాబు, మండల కార్యదర్శులు బండి వెంకటరెడ్డి, బండి ఆంజనేయులు, సీనియర్ నాయకుడు భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కిన్నెర మహేష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ నవీన్, చల్లా అప్పిరెడ్డి, దొడ్డపనేని కృష్ణయ్య, భీమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా నమిడ్ల నరేష్



**ఎల్కతుర్తి/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామ ఎంఆర్‌పీఎస్ శాఖ అధ్యక్షుడిగా నమిడ్ల నరేష్, ఏంఎస్‌పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మంద అనిల్‌కుమార్ మాదిగ ఎన్నికయ్యారు. మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ, మండల అధికార ప్రతినిధి జూపాక మధుకర్, ఏంఎస్‌పీ అధ్యక్షుడు కొయ్యడ రాజేందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధనకు కృషి చేస్తామని, సమాజంలో ఐక్యతను బలోపేతం చేసేందుకు పనిచేస్తామని తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా, మండల నాయకుల సూచనలతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఉపాధ్యక్షుడిగా వై.రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్తూరి అజయ్, సభ్యులుగా జూపాక సుమన్, నమిడ్ల శివకృష్ణ, కొయ్యడ ప్రవీణ్‌కుమార్, జూపాక రాహుల్, మారేపల్లి దిలీప్, పవన్, చరణ్‌రాజు తదితరులు ఎన్నికయ్యారు.

# అంబేద్కర్ భవన్ సెమినార్‌ను విజయవంతం చేయాలి



**పరకాల/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న సెమినార్, ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారుఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటం విజయవంతమైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ హనుమకొండ జిల్లాకు రానున్న నేపథ్యంలో విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భీమారం సమస్యలు పరిష్కరించాలి



**హసన్‌పర్తి/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):** 55వ డివిజన్ భీమారం ప్రాంతంలోని పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.భీమారం జంక్షన్ వద్ద ఉన్న డివైడర్ కారణంగా వాహనదారులు రోడ్డును అడ్డంగా దాటాల్సి వస్తోందని, దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. డివైడర్‌ను తొలగించి అక్కడ ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే భీమారం గ్రామంలో విద్యుత్ దీపాల సమస్యను పరిష్కరించాలని, శిథిలావస్థకు చేరిన పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అటికం రవీందర్, రాయకంటి సురేష్, పోగుల రమేష్, గుంజె సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


# విజేతలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ ప్రత్యేక శ్రద్ధ



**కల్లూరు/ ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త);**
విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిలోని ప్రతిభను వెలికితీస్తూ ఉన్నత శిఖరాల వైపు నడిపించేందుకు తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠ్యాంశాల బోధనతోపాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు చేపడుతున్నారు.ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సుమారు 1500 మంది విద్యార్థులకు వారి వయసు, సామర్థ్యానికి అనుగుణంగా బోధన అందిస్తున్నారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తిని పెంచుతూ.. భవిష్యత్తులో ఐఐటీ, నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా పునాది స్థాయిలో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్, పునశ్చరణ తరగతులు నిర్వహిస్తూ పరీక్షల భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నారు.చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల మనోభావాలను అర్థం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు చెదరకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడం ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ ప్రత్యేకతగా తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.పాఠశాల చైర్మన్ జాన్‌మియా చొరవ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల ముందుకు సాగుతోందని తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండించిన తుమ్మల.



**బయ్యారం/ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీజేపీ పార్టీ జిల్లా సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా బీజేపీ పార్టీని ఎదుర్కొనలేకే కాంగ్రెస్ పార్టీ హింసా రాజకీయాలకు పాల్పడుతోందని తుమ్మల శ్రీనివాస్ రావు విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్నామనే అహంకారంతో కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు దిగుతోందని,ఇలాంటి చర్యలను సహించేది లేదని తుమ్మల హెచ్చరించారు.బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా,ఐక్యంగా ఉండాలని తుమ్మల శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు.

# డ్రోన్ సాంకేతికతతో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన.



**బయ్యారం/ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం మోట్లతిమ్మాపురం గ్రామంలో నానో యూరియా ప్రాముఖ్యత,పంటలపై నానో యూరియాను డ్రోన్ సాంకేతికత ద్వారా పిచికారీ చేసే విధానంపై మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మోట్లతిమ్మాపురం గ్రామ సర్పంచ్ సాంబారావు,ఉప సర్పంచ్ రేవతి,బిజ్జ వెంకటేశ్వర్లు, బయ్యారం పశువైద్యాధికారి డా.ఎన్. అశోక్,ఏఈఓలు,రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు నానో యూరియా వినియోగం డ్రోన్ ద్వారా సమర్థవంతంగా పంటలకు పిచికారీ చేసే విధానం గురించి రైతులకు వివరించారు.డ్రోన్ సాంకేతికత ద్వారా తక్కువ సమయంలో సమానంగా పిచికారీ చేయడంతో పాటు,ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.అదేవిధంగా బయ్యారం పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ రైతులకు పశువులకు సకాలంలో టీకాలు వేయించడం,పశువుల ఆరోగ్య పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.భవిష్యత్ తరాన్ని ఆధునిక వ్యవసాయం వైపు ఆకర్షించే ఉద్దేశంతో మోట్లతిమ్మాపురం పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులను కూడా క్షేత్ర ప్రదర్శనకు ఆహ్వానించారు. విద్యార్థులు డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ చేసే విధానాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# ఉపాధి హామీ ఇక వీబీజీ రాంజీ

**-రైతులకు,వ్యవసాయ కూలీలకు అవగాహన.**



**బయ్యారం/ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం గ్రామపంచాయతీలో సోమవారం ప్రత్యేక గ్రామసభ గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ గ్రామ సభలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజిఎస్ పథకం పేరు మార్చి వీబీజీ రాంజీ గా పేరు మార్చి సెప్టెంబర్ 1 నుండి కొత్తగా పనులు మొదలవడం జరుగుతుందని తెలిపారు.వీబీజీ రాంజీ పతకంలో రైతులకి,కూలీలకు ఉపయోగించుకునే అంశాలను గ్రామసభలో టెక్నీకల్ అసిస్టెంట్ రమేష్,ఫిల్డ్ అసిస్టెంట్ బావ్ సింగ్ ప్రజలకి  అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ రాంబాబు, ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,వార్డు సభ్యులు బానోత్ సునీత,ఎట్టి సరిత, బందెల కళింగ రెడ్డి,ఎస్కే జానీ, బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, తాటి జనార్దన్,ఆకునూరి సూర్యనారాయణ,మధార్,బిళ్ళకంటి వెంకన్న,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి.

**-బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఆర్ వీ.**



**బయ్యారం/ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ రేపాకుల వెంకన్న (ఆర్ వీ) ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని,ఉద్యోగాలు లేక ప్రభుత్వం ఇస్తామన్నా నిరుద్యోగ భృతి లేక నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని,తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆర్ వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## లక్కమారికాపు పరపతి సంఘ అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి



**సంగెం/ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**సంగెం మండలం మొండ్రాయి గ్రామంలోని సీతారామ లక్కమారికాపు పరపతి సంఘం రెండో మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్లి పురుషోత్తం రెడ్డి ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా కడుదూరి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల సంపత్, కోశాధికారిగా సింగిరెడ్డి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా కొనకటి బాలరాజు, గూడ రవిసాగర్, గోనె వీరభద్రయ్య, ఎరుకల రాజమౌళి, ముస్కు రాజు, కూస రాజు, ఏడాకుల శ్రీనివాస్, పెంతల స్వామి, అనుముల రాజు, పెండ్లి రవికుమార్, యార మల్లయ్య, అనుముల యుగేందర్, పొన్నాల హరీష్, కడుదూరి రమేష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కుల పెద్దలు, పాలకవర్గం, సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు







**ఖమ్మం/ఆగస్టు 31 (జర్నలిస్ట్ వార్త):**
జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఖమ్మం జిల్లా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గట్టయ్య సెంటర్‌లోని మహారాష్ట్ర బ్యాంకు భవనం రెండో అంతస్తులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగింది.ఈ సందర్భంగా స్మార్ట్ మ్యాక్స్ విజన్ కంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తార డెంటల్ ఆసుపత్రి వైద్య బృందాలు కంటి, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. దృష్టి లోపాలు, కంటి సంబంధిత సమస్యలతో పాటు పళ్ళు, చిగుళ్ల సమస్యలు, దంతాల శుభ్రత, రూట్‌కెనాల్ తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించారు.
మీడియా రంగంలో నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. బిజీ షెడ్యూల్ కారణంగా వైద్య పరీక్షలకు దూరమవుతున్న మీడియా ప్రతినిధులకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఉచిత వైద్య సేవలు అందించిన స్మార్ట్ మ్యాక్స్ విజన్ కంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తార డెంటల్ ఆసుపత్రి యాజమాన్యాలు, వైద్య బృందాలకు ఖమ్మం జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఐ. ప్రభాకర్, కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బయ్యారం మండల రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి.







**-సిపిఎం పార్టీ మండల కమిటీ.**

**బయ్యారం)ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల రైతులు వరినాట్లు వేసి భారీగా పెట్టుబడులు పెట్టారని, నీళ్ళు లేక నష్టపోతున్నారని, అధికారులు స్పందించి వెంటనే నీళ్ళు విడుదల చేసి పంటలను కాపాడాలనీ,నీళ్ళు ఇవ్వకపోతే ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బయ్యారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల అయినా ప్రజల,రైతుల ఇబ్బందులు తీర్చలేదని విమర్శించారు.ప్రధానంగా బయ్యారం పెద్ద చెరువు నీళ్ళు వరిపంటకు అందించాలని,ఇప్పటికే 80 శాతం రైతులు పొలాల్లో వడ్లు వెదజల్లారని, ఈ రెండు నెలల్లో కలుపు మందు,ఎరువులు వేసి దాదాపుగా పూర్తి పెట్టుబడి పెట్టి ఉన్నారని కావున పంటకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా బయ్యారం చెరువుకు నీళ్లు అందించి, కాలువల శాశ్వత మరమ్మతులు చేపట్టాలని,ప్రాధమిక ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,కనీస సౌకర్యాలు కల్పించాలని,అర్హులైన, వారందరికీ ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ కార్యాలయల మందు ధర్నాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కుంట ఉపేందర్,నంబూరి మధు,మండా రాజన్న,కత్తి రమేష్ రాజా,వల్లాల కల్పన,అంగిరేకుల లలిత,బోడ రూపేష్,అంగిరేకుల నాగేశ్వరరావు,నిడికొండ చంటి,వల్లాల వెంకన్న,తిరుపతిరావు, శ్యాం,పెంటయ్య, రాము,రవి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

**బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం -మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్,ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త)::**హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ÷ర అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు

# తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు

**మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి**

**మహబూబ్‌నగర్,ఆగస్టు 31(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణసోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేందప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో
42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని




కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛ స్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్యం÷-ర వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బు÷-లలెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బు÷-లలెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.